ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
పార్వతీపురం మన్యం
జిల్లా వార్తలు
మంగళవారం 11 నవంబరు 2025



స్వయం ఉపాధి శిక్షణకు స్థలం కేటాయింపు

పార్వతీపురం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ నిర్మాణం కోసం పార్వతీపురంలోని కొత్తవలస ప్రాంతంలో సర్వేనెంబర్ 117/1లో ఎకరా ప్రభుత్వ భూమిని కేటాయించారు. దీనిపై మంత్రి వర్గం సోమవారం ఆమోదం తెలిపింది. అదే విధంగా జిల్లాకేంద్రంలో ఎస్‌బీఐ ప్రధాన శాఖ వద్ద లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ పేరిట 30 సంవత్సరాల లీజు కోసం వెళ్లిన స్థల ప్రతిపాదనలకు మంత్రి మండలి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఎకరాకు ఏడాదికి రూ.వెయ్యి చెల్లించనున్నారు. షరతుల మేరకు భూమిని కేటాయిస్తూ మంత్రి మండలం ఆమోదం తెలిపింది.

హై అలర్ట్!

- ఢిల్లీలో బాంబు పేలుడు ఘటనతో పోలీసులు అప్రమత్తం
- జిల్లాలో విస్తృతంగా తనిఖీలు



జిల్లాకేంద్రంలో డాగ్ స్క్వాడ్ సిబ్బందితో తనిఖీ చేయిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి



కొమరాడ మండలంలో..



పాలకొండ: వాహనాలను పరిశీలిస్తున్న డీఎస్పీ



వీరఘట్టంలో మండలం కిమ్మి జంక్షన్ వద్ద వాహనాల తనిఖీ చేపడుతున్న పోలీసులు

పార్వతీపురం/బెలగాం/పాలకొండ, నవంబరు 10(ఆంధ్రజ్యోతి):

దేశ రాజధాని ఢిల్లీలోని బాంబు పేలుడు ఘటనతో రాష్ట్ర ప్రభుత్వం హై అలెర్ట్ ప్రకటించింది. దీంతో జిల్లా పోలీసులు అప్రమత్తమయ్యారు. ఈ మేరకు సోమవారం రాత్రి విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ప్రతి వాహనాన్నీ క్షుణ్ణంగా పరిశీలించారు. పార్వతీపురం పట్టణంలో పలు చోట్ల పోలీసులు తనిఖీలు నిర్వహిం చారు. ఎస్పీ మాధవరెడ్డి, సీఐ మురళీధర్ తదితరులు ప్రధాన కూడళ్ల, ఆర్టీసీ కాంప్లెక్స్, రైల్వే స్టేషన్లలో వాహనాలను ఆపి పరిశీలించారు. వాహన దారుల వివరాలను నమోదు చేసుకున్నారు. పాలకొండలోని వీరఘట్టం జంక్షన్‌లో డీఎస్పీ ఎం.రాంబాబు వాహనాలను తనిఖీ చేశారు. ఆయన వెంట సీఐ ఏ.ప్రసాదరావు, ఎస్ఐ ప్రయోగమూర్తి సిబ్బంది ఉన్నారు. సాలూరు, కొమరాడ, కురుపాం తదితర ప్రాంతాల్లో పోలీసులు ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు. ఒడిశాతో పాటు విశాఖ, విజయనగరం నుంచి వచ్చే వాహనాలను పరిశీలించారు.

ఏరియా ఆసుపత్రి కిటకిట

- భారీగా పెరిగిన ఓపీ
- చిన్నారులను వేధిస్తున్న బ్లడ్ ఇన్‌ఫెక్షన్



ఏరియా ఆసుపత్రిలో ఇన్‌పేషెంట్లు ఇలా..

సీతంపేట రూరల్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలు, వాతావరణంలో చోటుచేసుకున్న మార్పుల కారణంగా ఏజెన్సీలో జ్వరపీడితుల సంఖ్య పెరుగుతోంది. ప్రధానంగా చిన్నారులు బ్లడ్ ఇన్‌ఫెక్షన్లతో నానా అవస్థలు పడుతున్నారు. సోమవారం సీతంపేట ఏరియా ఆసుపత్రి రోగులతో కిక్కిరిసింది. మొత్తంగా 345 వరకు ఓపీ నమోదైంది. ఇందులో జ్వరం, బ్లడ్ ఇన్‌ఫెక్షన్ వంటి అనారోగ్య సమస్యలతో 57మంది చిన్నారులు తల్లిదండ్రులతో కలిసి వచ్చారు. వీరిలో ఆరుగురు చిన్నారులు ఇన్‌పేషెంట్లుగా ఆసుపత్రిలో చేరారు. 61 మంది జ్వరపీడితుల్లో 36మంది ఇన్‌పేషెంట్లుగా చేరారు. ఆసుపత్రిలో రోగులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నామని సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు చెప్పారు.

జీసీసీ ద్వారా నాణ్యమైన వస్తువుల విక్రయం

- జాయింట్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్‌రెడ్డి



సంతలో విక్రయించనున్న సరుకులను పరిశీలిస్తున్న జేసీ

పార్వతీపురం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జీసీసీ ద్వారా నాణ్యమైన వస్తువులను వి క్రయిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి అన్నారు. జన్ జాతీయ గౌరవ దినోత్సవంలో భాగంగా సోమవారం పార్వతీపురం ఐటీడీఏలో ప్రత్యేక గిరిజన సంతను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'గిరిజనుల వద్ద నాణ్యమైన వస్తువులు లభిస్తాయి. ప్రతి ఒక్కరూ జీసీసీ ద్వారా కొనుగోలు చేయాలి. అటవీ ఉత్పత్తులను నేరుగా గిరిజనుల నుంచి కొనుగోలు చేయడం వల్ల వారికి మద్దతు ధర లభిస్తుంది. గిరిజన రైతులను ప్రోత్సహించడమే లక్ష్యంగా పనిచేయాలి. దళారుల నుంచి వారిని రక్షించేందుకే గిరిజన సంత నిర్వహిస్తున్నాం.' అని తెలిపారు. అనంతరం ఐటీడీఏ ఆవరణలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను జేసీ సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో మురళీధర్, జీసీసీ డివిజన్ మేనేజర్లు పాల్గొన్నారు.

శివోహం

- భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు
- ప్రాంగణాల్లో కార్తీక దీపారాధనలు



సీతంపేటలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

సీతంపేట రూరల్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం మూడో సోమవారం పురస్కరించుకుని భక్తులు శివాలయాలకు క్యూ కట్టారు. పంచాక్షరీ నామాన్ని జపిస్తూ శివుడికి అభిషేకాలు చేశారు. ఉపవాసాలతో దీపారాధనలు చేశారు. తెల్లవారుజాము నుంచే భక్తులతో ఆలయాలు బారులుతీరాయి. శివనామ స్మరణతో మార్మోగాయి. నదులు, చెరువులు, కోనేరుల్లో దీపాలు వెలిగించి శివుడికి భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలో జరిగిన సంఘటన నేపథ్యంలో రద్దీగా ఉన్న ఆలయాల వద్ద పోలీసులు ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు. సీతంపేట ఏజెన్సీలో భద్రాద్రిగా పేరుగాంచిన శ్రీరామగిరి క్షేత్రం, ముక్కుడిపోలమ్మ ఆలయ సమీపంలో కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో లక్ష దీపారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. సీతంపేట, కొత్తూరు, మెట్టూరు, పులిపుట్టి, మాసింగి గ్రామాల నుంచి పెద్దఎత్తున మహిళా భక్తులు తరలివచ్చారు.

దేదీప్యమానంగా అఖండ జ్యోతి



పంచముఖేశ్వర ఆలయంలో అఖండజ్యోతి

సాలూరు రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సాలూరు పంచముఖేశ్వర ఆలయంలో దేదీప్యమానంగా వెలుగుతున్న అఖండ జ్యోతి కార్తీక మూడో సందర్భంగా భక్తుల నుంచి విశేష పూజలందుకుంది. తొలుత భక్తులు శివయ్యకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం అఖండ జ్యోతిని దర్శించుకున్నారు. వాస్తవంగా రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా సాలూరు పంచముఖేశ్వర ఆలయంలో అఖండ జ్యోతిని వెలిగించడం ఆచారంగా వస్తుంది. దీని ప్రమిదలో 430 లీటర్ల తైలం పడుతుంది. కార్తీకమాసమంతా జ్యోతిని వెలిగించడానికి 1200 వందల లీటర్ల తైలం అవసరమని ఆలయ వర్గాలు తెలిపాయి. కార్తీక మాసం ఈ నెల 20తో ముగియగా.. అఖండ జ్యోతి మార్గశిర మాసం వరకు కొనసాగనుంది.

ఘనంగా కుంబిడి ఇచ్ఛాపురం యాత్ర

- వేలాదిగా తరలివచ్చిన భక్తులు



స్వయంభు శివలింగానికి అభిషేకాలు చేస్తున్న భక్తులు



క్యూలో ఉన్న భక్తులు

వీరఘట్టం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం మూడో సోమవారం సందర్భంగా కుంబిడి ఇచ్ఛాపురంలో నిర్వహించిన యాత్రకు భక్తులు పోటెత్తారు. దీంతో ఆ ప్రాంతమంతా శివనామస్మరణ మార్మోగింది. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచే కాకుండా ఒడిశా నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తజనం వేకువజామునే ఉమామహేశ్వర స్వామి ఆలయానికి చేరుకున్నారు. క్యూ లైన్లలో గంటల కొద్దీ నిరీక్షించిన తర్వాత స్వయంభు శివలింగాన్ని దర్శించుకుని పరవశించి పోయారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పోలీస్ సిబ్బంది ముందస్తు చర్యలు చేపట్టారు. క్యూలైన్లలో తోపులాట జరగకుండా చూసుకున్నారు. వాహనాలకు ప్రత్యేక పార్కింగ్ ఏర్పాట్లు చేశారు. ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులందరికీ అన్నదానం ఏర్పాట్లు చేశారు. ఎస్ఐ జి.కళాధర్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

పీఎంఏవై-జీ గడువు పెంపు

- ఈ నెల 30 వరకు నమోదుకు అవకాశం
- లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం చేపట్టేందుకు చర్యలు



రావుపల్లిలో నిర్మాణ దశలో ఉన్న గృహాలు

గరుగుబిల్లి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఆవాస్ యోజన్-గ్రామీణ్ (పీఎంఏవై-జీ) పథకానికి ఈ నెల 30 వరకు గడువు పొడిగించారు. గ్రామాల్లో అర్హులైన లబ్ధిదారులకు గృహ నిర్మాణాలు చేపట్టేందుకు మరో అవకాశం కల్పించారు. వాస్తవంగా గ్రామాలు, పట్టణాల్లో లబ్ధిదారులు గృహ నిర్మాణాలకు ముందుకొచ్చేందుకు ఈ నెల 5 వరకు గడువు ఇచ్చారు. ఈ మేరకు గ్రామ, వార్డు సచివాలయాల్లో అర్హుల వివరాలు నమోదు చేశారు. సోమవారం నాటికి 15 మండలాల పరిధిలో 463 మందిని మ్యాపింగ్ చేశారు. ఇందులో 327 మంది ఈకేవైసీ నిర్వహించారు. మరో 136 మందికి ఈకేవైసీ నిర్వహించాల్సి ఉంది. మొత్తంగా జిల్లాలో 5,683 మందికి గాను 4,937 మంది లబ్ధిదారుల నుంచి సమాచారాన్ని సేక రించారు. అయితే గ్రామస్థాయిలో అనుకున్న మేర లక్ష్యాలను చేరుకోకపోవడంతో మరోసారి గడువు పొడిగించారు. ఈ మేరకు లబ్ధిదారుల వివరాలను సంబంధిత సచివాలయాల పరిధిలోని సిబ్బంది ఆవాస్ యాప్‌లో నమోదు చేయనున్నారు. లబ్ధిదారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ. 1.80 లక్షలు మంజూరు చేయనుంది. అయితే నిధులు చాలకపోవడంతో చాలామంది వెనుకంజ వేస్తున్నారు. సాయం మొత్తం పెంచాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

ఆదేశాలు అందాయి..

గృహ నిర్మాణాలకు సంబంధించి గడువు పెంపుపై ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందాయని ఎంపీడీవో జి.పైడితల్లి, గృహ నిర్మాణశాఖ జేఈ వి.అఖిల్ సోమవారం తెలిపారు. లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణంపై అవసరమైన అవగాహన కల్పిస్తున్నామన్నారు. నిర్దేశించిన లక్ష్యాలను చేరుకునేందుకు ప్రణాళికలు రూపొందించామని వెల్లడించారు.

ఐటీడీఏలో కంట్రోల్ రూం

- వైద్య సేవలు అందించేందుకు చర్యలు

పార్వతీపురం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): పార్వతీపురం ఐటీడీఏలో సోమవారం కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. గిరిజన గ్రామాల్లో ఎవరైనా తక్షణ వైద్య సేవలు పొందాలనుకునే వారు ఐటీడీఏలోని ఉప వైద్యఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో ఈ 94914 72982 నెంబర్ ఫోన్ చేయాలని జాయింట్ కలెక్టర్, ఇన్‌చార్జి పీవో యశ్వంత్ కుమార్‌రెడ్డి తెలిపారు. పరిస్థితులను బట్టి వాహన సదుపాయం కూడా కల్పిస్తామని వెల్లడించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో అనారోగ్యానికి గురైన వారికి సమీపంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్య సేవలు అందించేందుకు వీలుగా ఈ చర్యలు తీసుకున్నామన్నారు. కాగా పార్వతీపురం ఐటీడీఏలో తొలిసారిగా కంట్రోల్ రూం ఏర్పాటు చేయడం పై సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.



గజరాజుల బీభత్సం

కొమరాడ, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కొమరాడ మండలంలో గజరాజులు బీభత్సం సృష్టించాయి. సోమవారం మాదలింగి, చెక్కవలస గ్రామాల మధ్య సంచరించి.. వరి, పత్తి, పామాయిల్ పంటలను ధ్వంసం చేశాయి. దీంతో రైతులు లబోదిబోమన్నారు. కోత దశలో ఉన్న పంటను నష్టపోవడంతో తీవ్ర ఆవేదన చెందుతున్నారు. తక్షణమే ఈ ప్రాంతం నుంచి ఏనుగులు గుంపు తరలించాలని, తమను ఆదుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. కాగా రాత్రివేళల్లో పంట పొలాలకు వెళ్లే రైతులు అప్రమత్తంగా ఉండాలని ఫారెస్ట్ సిబ్బంది సూచిస్తున్నారు.

టీడీపీ నేతలకు కార్పొరేషన్ల డైరెక్టర్ పదవులు 6లో

రైతులకు లబ్ధి చేకూర్చడమే లక్ష్యం 6లో

● శివాలయాలకు పోటెత్తిన భక్తులు ● బందోబస్తు ఏర్పాటుచేసిన పోలీసు యంత్రాంగం

శివోహం

కార్తీక మూడో సోమవారం పురస్కరించుకుని శివాలయాలకు భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచి భక్తులు ఆలయాలకు చేరుకున్నారు. రద్దీ ఎక్కువగా ఉండడంతో ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. ఇటీవల కాశీబుగ్గ ఘటన నేపథ్యంలో అవాంఛనీయ సంఘటనలో చోటుచేసుకోకుండా పోలీసు యంత్రాంగం ఆలయాల వద్ద బందోబస్తు నిర్వహించింది.


శృంగవరపుకోట: పుణ్యగిరి పుట్టధార వద్ద భక్తులు స్నానాలు


లక్కవరపుకోట: రంగారాయపురంలో విభూది అద్దుతున్న ఎమ్మెల్యే దంపతులు


సాలూరు రూరల్: కామాక్షి ఆలయంలో ఏక్రామనాథుడు..


ఎస్.కోట రూరల్: సన్యాసయ్య పాలెంలో సన్యాసేశ్వరుడు..


పాలకొండ: మరకత శివలింగానికి చందనం పూసిన దృశ్యం


సాలూరు రూరల్: గుమ్మలకొండపై గుహాలయంలో..


భామిని: పెద్దదిమిలిలో ఎండల మల్లికార్జునుడు..


ఎస్.కోట: పుణ్యగిరిలో ఉమాకోటి లింగేశ్వర స్వామి


గరుగుబిల్లి: గిజబ కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో..


పార్వతీపురం రూరల్: అడ్డాపుశీల కాశీవిశ్వేశ్వర ఆలయంలో నందీశ్వరుని విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు


గరుగుబిల్లి: క్యూలైన్‌లో బారులుదీరిన భక్తులు


భోగాపురం: ముంజేరులోని సత్యసాయి మందిరంలో రుద్రాభిషేకం


పార్వతీపురం టౌన్: ఉమామార్కండేయ స్వామి ఆలయంలో..


నెల్లిమర్ల: రామతీర్థం శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు


సంతకవిటి: మోదుగులపేటలో కాశీవిశ్వేశ్వర దేవాలయంలో రుద్రాభిషేకం చేస్తున్న భక్తులు


రాజాం: డోలపేటలో ఉమామహేశ్వర లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో దీపారాధన చేపడుతున్న దృశ్యం


రేగిడి: సంకిలి శివాలయంలో భక్తుల రద్దీ దృశ్యం


రాజాం రూరల్: మొగిలివలసలో కాశీవిశ్వేశ్వరాలయంలో..


గజపతినగరం: మరుపల్లి శివాలయంలో భక్తులు


గంట్యాడ: సిరిపురం శివాలయంలో భక్తులు క్యూ

నీలావతి కొండపై బుద్ధుడి స్థూపాలు

● కార్తీక మాసంలో సందర్శకులు తాకిడి


కొండపైకి వెళ్ళాడానికి నిర్మాణం చేసిన మెట్లు


దుర్గ భైరవి విగ్రహం



విజయనగరం కలెక్టరేట్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నీలావతి కొండపై బుద్ధుడి స్థూపాలు ఇప్పటికీ చెక్కుచెదరలేదు. కార్తీక మాసం వచ్చిందంటే ఇక్కడకు సందర్శకులు ఎక్కువ సంఖ్యలో వస్తారు. ప్రకృతి అందాలను తనివితీరా తిలకిస్తారు. జిల్లా కేంద్రానికి 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న నీలావతి గ్రామ సమీపాన 30 ఎకరాల విస్తీర్ణంలో బౌద్ధారామ పుణ్యక్షేత్రం ఉంది. ఈ కొండపై బుద్ధుడి స్థూపాలు, దుర్గా భైరవి ఏకశిలా విగ్రహం ఉంది. అలాగే అప్పటి పాలకులు నిర్మాణం చేసిన మెట్లు కూడా ఉన్నాయి. ఇక్కడ రాముడు పాదముద్రికలు, నిత్యం నీటితో కళకళలాడే 16 అడుగులు లోతున్న కొలను, పలు ఆకారాల్లో స్థూపాలు, రాతి మెట్లు ఉన్నాయి. ఈకొండ పురావస్తుశాఖ ఆధీనంలో ఉంది. ఇక్కడ 1986 సంవత్సరంలో ఒక గార్డును నియమించారు. పది సంవత్సరాల క్రితం కొండ చుట్టూ కంచె కూడా ఏర్పాటు చేశారు. స్థూపాలను, విగ్రహాలను పాడు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేశారు. ఇక్కడి అందాలను తిలకించడానికి ఇతర జిల్లాలు నుంచి కూడా వస్తారు. ప్రధానంగా కార్తీమాసం వచ్చిందంటే సందర్శకుల తాకిడి ఎక్కువగా ఉంటుంది.

రైతులకు లబ్ధి చేకూర్చడమే లక్ష్యం

● డీసీసీబీ చైర్మన్ కిమిడి నాగార్జున


పీఏసీఎస్ అధ్యక్షులనుద్దేశించి మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ నాగార్జున

పార్వతీపురం టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రైతులందరికీ లబ్ధి చేకూర్చడమే సొసైటీల లక్ష్యమని ఉమ్మడి జిల్లా డీసీసీబీ చైర్మన్ కిమిడి నాగార్జున అన్నారు. సోమవారం పట్టణంలోని ఓ ప్రైవేట్ కల్యాణ మండపంలో డివిజన్‌లోని 48 సంఘాల అధ్యక్షులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. 'డీసీసీబీకి రైతులే వెన్నెముక. ఈ విషయాన్ని ప్రతిఒక్కరూ గుర్తించాలి. వచ్చే ఆర్థిక సంవత్సరంలో పీఏసీఎస్‌ల వ్యాపార ప్రణాళికలతో పాటు వాటి పటిష్టానికి పక్కా కార్యచరణ రూపొందించుకోవాల్సిన అవశ్యకత ఎంతైనా ఉంది. పీఏసీఎస్ అధ్యక్షులతో పాటు సభ్యులు విధిగా కో ఆపరేటివ్ చట్టాలు, నిబంధనలు, విధులు, అధికారాలు, బాధ్యతలు తెలుసుకోవాలి. రుణాలు తీసుకున్నవారు తిరిగి చెల్లించకపోతే కఠిన చర్యలు తీసుకోవాలి. ఎఫ్‌డీ ఖాతాదారుల సంఖ్యను పెంచేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలి. డీసీసీబీ అధిక వడ్డీ చెల్లిస్తుందనే విషయాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలి. సొసైటీల నుంచి వచ్చిన వినతులు, సమస్యలను త్వరితగతిన పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలి.' అని తెలిపారు. కార్యక్రమంలో డీసీసీబీ సీఈవో ఉమా మహేశ్వరరావు, డీసీవో వాణిశైలజ, తదితరులు పాల్గొన్నారు.


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ మాధవరెడ్డి

బాధితులకు సత్వర న్యాయం

● ఎస్పీ మాధవరెడ్డి

బెలగాం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఫిర్యాదుల పరిష్కారమే ధ్యేయంగా పనిచేయాలని, బాధితులకు సత్వర న్యాయం చేయాలని ఎస్పీ ఎస్‌వీ మాధవరెడ్డి సంబంధిత పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పీజీఆర్‌ఎస్‌నిర్వహించారు. ఈ సందర్భంగా ఫిర్యాదు దారులతో నేరుగా ఆయన మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బాధితులు ఇచ్చిన వినతిపత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. త్వరగతిన దర్యాప్తు చేపట్టి బాధితులకు తగిన న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. అలసత్వం లేకుండా సత్వరం పరిష్కార మార్గం చూపాలన్నారు. భూ వివాదాలు, సైబర్ క్రైం, ప్రేమ పేరుతో మోసాలు, కుటుంబ తగాదాలు, నకిలీ పత్రాలు, అత్తారింటి వేధింపులు, అధిక వడ్డీలు, తదితర అంశాలపై ఎక్కువగా ఫిర్యాదులు అందినట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డీసీఆర్‌బీ ఎస్ఐ రమేష్ నాయుడు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సురక్షిత ప్రసవమే లక్ష్యం

● డీఎంహెచ్‌వో భాస్కరరావు

పార్వతీపురం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): సురక్షిత ప్రసవమే లక్ష్యంగా గర్భిణులకు వైద్య సేవలందించాలని డీఎంహెచ్‌వో ఎస్.భాస్కరరావు ఆదేశించారు. సోమవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో మాతా, శిశు ఆరోగ్యంపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. గర్భిణులకు నిర్దేశించిన ప్రతి ఆరోగ్య కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో వైద్యాధికారులు పర్యవేక్షించాలని సూచించారు. పీహెచ్‌సీల్లో ప్రసవాల సంఖ్య పెరగాలని తెలిపారు. గతంలో జీఎన్‌పేట పీహెచ్‌సీ పరిధికి చెందిన గర్భిణీ మృతికి గల కారణాలపై సమీక్షించారు. సమావేశంలో డీసీహెచ్ఎస్ నాగభూషణరావు, డీఐవో విజయమోహన్, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వోలు పద్మావతి, విజయపార్వతి తదితరులున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో


ఫిర్యాదుదారుడితో మాట్లాడుతున్న కలెక్టర్

ఫిర్యాదులను పరిష్కరించండి

విజయనగరం కలెక్టరేట్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) ప్రజా ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ రామసుందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌లో ఆయన 178 వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి దరఖాస్తుదారుడు సంతృప్తి చెందే విధంగా పరిష్కారం ఉండాలన్నారు. సమయపాలనతో పారదర్శకంగా ప్రతి ఫిర్యాదును పరిష్కారించాలని సూచించారు. డీఆర్‌వో శ్రీనివాసమూర్తి, ప్రత్యేక ఉప కలెక్టర్లు వెంకటేశ్వరరావు, మురళి, రాజేశ్వరి, ప్రమీల గాంధీ, శాంతి, కళావతి ఉన్నారు.

టీడీపీ నేతలకు కార్పొరేషన్ల డైరెక్టర్ పదవులు

పార్వతీపురం, నవంబరు10(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు నియోజకవర్గాలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలకు కార్పొరేషన్ల డైరెక్టర్ల పదవులు వరించాయి. దీనికి సంబంధించి సోమవారం రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. నాగవంశపు వెల్ఫేర్ అండ్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్లుగా పార్వతీపురం, సాలూరు నియోజకవర్గాల నుంచి హనుమంతు శంకరరావు, జరజాపు దిలీప్ నియామక మయ్యారు. కాపు వెల్ఫేర్ అండ్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ గా సాలూరు నియోజకవర్గానికి చెందిన ఎం.చిరంజీవి, కళింగ కోమటి వెల్ఫేర్ అండ్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్లుగా కురుపాంకు చెందిన వారణాసి శివకుమార్, పాలకొండకు చెందిన తూముల రమేష్ నియామకమ య్యారు. దాసరి వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్లుగా పార్వతీపురం నియోజకవర్గం నుంచి రంగుముద్రి సంజీవనాయుడు, పి.గోవిందరావును నియమించారు.

ఘనంగా పార్వతీపరమేశ్వరుల కల్యాణం

చీపురుపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం మూడో సోమవారం సందర్భంగా చీపురుపల్లి శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయం వద్ద పార్వతీపరమేశ్వరుల కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ సాధు పరిషత్ అధ్యక్షుడు, ఆనందాశ్రమం పీఠాధిపతి శ్రీనివాసానంద సరస్వతి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. పట్టణానికి చెందిన భక్తులు కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో లక్ష దీపారాధన నిర్వహించారు.


పార్వతీ పరమేశ్వరుల కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

బ్రౌన్‌కు నివాళి

విజయనగరం కలెక్టరేట్, నవంబరు10 (ఆంధ్రజ్యోతి) ఆంధ్ర భాష పండితుడు, తెలుగు నిఘంటువు రచయిత సీపీ బ్రౌన్ జయంతిని సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించారు. బ్రౌన్ చిత్రపటానికి డీఆర్వో శ్రీనివాసమూర్తి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు భాషను సంరక్షించడానికి ప్రాచీన సాహిత్యాన్ని పరిరక్షించడానికి సీపీ బ్రౌన్ చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో సీపీవో బాలాజీ, డీఈవో మాణిక్యం నాయుడు ఉన్నారు.

కల్లుగీత కార్మికుల నిరసన

విజయనగరం కలెక్టరేట్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కల్లుగీత కార్మికులు డిమాండ్ చేశారు. సో మవారం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భం కల్లుగీత కార్మిక సంఘ నాయకులు మాట్లాడుతూ జీవో నెంబరు 560 అమలు చేసి అర్హులైన ప్రతి గీత కార్మికుడుకి 45 సంవత్సరాలకే పించన్ మంజూరు చేయాలన్నారు. ఆదరణ పథకాన్ని పునరుద్ధరించి పని ముట్లు అందజేయాలన్నారు. స్థానిక సంస్థల్లో 50 సీట్లు కేటాయించాలని కోరారు. గీత కార్మికల సంఘాల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలోని కల్లుగీత కార్మికులు, సంఘ నాయకులు ఉన్నారు.

ఐక్య పోరాటాలకు సిద్ధంకండి

రాజాం రూరల్, నవంబరు10 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ చేపట్టనున్న ఐక్య పోరాటాలకు కార్మికవర్గం సిద్ధం కావాలని కార్మిక సంఘాల ఐక్యవేదిక జిల్లా నాయకుడు రామ్మూర్తినాయుడు పిలుపునిచ్చారు. రాజాంలో సోమవారం నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తూ ప్రజల ఆస్తులను, ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా అమ్మకాలు చేస్తున్నారని ఆరోపించారు. అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్న భోజన పథ కాలకు బడ్జెట్‌ను తగ్గించిందన్నారు. వాటిని ప్రయివేటీకరణ చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉందన్నారు. కార్మికులకు కనీస వేతనాలు కూడా అమలు చేయడం లేదని మండిపడ్డారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత


చెక్కును అందజేసున్న రామ్‌మల్లిక్‌నాయుడు

గుర్ల, నవంబరు10 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన వారికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ఆర్థిక సాయం మంజూరైంది. సోమవారం టీడీపీ యువ నాయకుడు, రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు గోషాడ గ్రామానికి చెందిన దాసరి పద్మ, టొంపల చిరంజీవి, పెనుబర్తి గ్రామానికి చెందిన పిసిని రాంబాబు, గూడెం గ్రామానికి చెందిన జమ్ము ముసలినాయుడు, గిరిడ గ్రామానికి చెందిన రఘుమండ రవేతి, భూపాలపురం గ్రామానికి చెందిన కోరాడ అబినాష్, కోరాడ రామారావులకు చెక్కుల అందజేశారు. టీడీపీ కార్యాలయంలో రూ.7 లక్షల 15వేల 872లు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి సన్యాసినాయుడు, మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ దాసరి శివప్రసాద్, మండల పార్టీ అధ్యక్షుడు సీహెచ్.మహేశ్వరరావు, గూడెం సొసైటీ అధ్యక్షుడు పీల్ల అప్పలనాయుడు పాల్గొన్నారు.

టీడీపీ మండల అధ్యక్షుడిగా అచ్చెన్నాయుడు

శృంగవరపుకోట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట మండల టీడీపీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా సీతారాంపురం గ్రామానికి చెందిన డోకుల అచ్చెన్నాయుడు, శివరామరాజుపేట గ్రామానికి చెందిన కోట్యాడ జగదీశ్‌లను అధిష్టానం నియమించింది. ఈ సందర్భంగా వారు సీఎం చంద్రబాబు నాయుడు, పార్టీ ప్రధాన కార్యదర్శి లోకేశ్, ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల బాలాజీ అప్పల రామప్రసాద్, విశాఖ ఎంపి ఎం.శ్రీభరత్‌లకు కృతజ్ఞతలు తెలిపారు

దాసరి కార్పొరేషన్ డైరెక్టర్లుగా నానిగిరి, గనివాడ


నానిగిరి రమణాజీ, బంగారు నాయుడు

శృంగవరపుకోట, నవంబరు10 (ఆంధ్రజ్యోతి): దాసరి వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ సొసైటీ కార్పొరేషన్ డైరెక్టర్లుగా పట్టణానికి చెందిన నానిగిరి రమణాజీ, గనివాడ బంగారు నాయుడులను ప్రభుత్వం నియమించింది. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యే కోళ్ళలలిత కుమారి, విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

నాగవంశం కార్పొరేషన్ డైరెక్టర్‌గా సత్యవతి


సత్యవతి

నెల్లిమర్ల, నవంబరు10(ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల నగర పంచాయతీ జరజాపుపేట గ్రామానికి చెందిన టీడీపీ నాయకురాలు కాళ్ల సత్యవతి.. నాగవంశం సంక్షేమ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. సోమవారం సంబంధిత ఉత్తర్వులు జారీ అయ్యాయి. సత్యవతికి రాష్ట్రస్థాయి పదవి రావడంపై పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సత్యవతి మాట్లాడుతూ తనకు పదవి వచ్చేందుకు సిఫారసు చేసిన ఏపీ మార్క్‌ఫెడ్ ఛైర్మన్, టీడీపీ నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జ్ కర్రోతు బంగార్రాజుకు, పార్టీ సీనియర్ నాయకుడు సువ్వాడ రవిశేఖర్‌కు, మండల కమిటీ అధ్యక్షుడు కడగల ఆనంద్‌కుమార్‌కు, గేదెల రాజారావుకు కృతజ్ఞతలు తెలిపారు.

శిక్షణ కేంద్రానికి వసతులు కల్పించండి

●ఎంపీ కలిశెట్టిని కోరిన స్కౌట్ ప్రతినిధులు


ఎంపీ కలిశెట్టికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

నెల్లిమర్ల, నవంబరు10 (ఆంధ్రజ్యోతి): భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ కేంద్రానికి మౌలిక వసతులను కల్పించాలని ఎంపీ కలిశెట్టి అప్పల నాయుడును శిక్షణ కేంద్ర ప్రతినిధులు కోరారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ ఫౌండేషన్ డే వారోత్సవాల్లో భాగంగా ఎంపీని రణస్థలంలోని ఆయన నివాసంలో సోమవారం ఎమ్మెల్సీ డాక్టర్ గాదె శ్రీనివాసులు నాయుడు కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్సీలకు స్కౌట్స్ అండ్ గైడ్స్ స్కార్ఫ్‌నే శిక్షణ కేంద్ర ప్రతినిధులు వేశారు. అనంతరం ఫ్లాగ్‌డే స్టిక్కర్లను ఆవిష్కరింపజేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రతినిధులు కార్యదర్శి వాక చిన్నంనాయుడు, ట్రెజరర్ మతల భాస్కర రావు, ట్రైనింగ్ కమిషనర్ వసాది సూర్య నారాయణ, హెడ్ క్వార్టర్ కమిషనర్ ఎస్ఎస్.దొర మాట్లాడారు. విజయగనరంలోని పూల్ బాగ్‌లో దేశంలోనే అతిపెద్ద రెండో సువిశాల శిక్షణ కేంద్రాన్ని అభివృద్ధి చేయాలని కోరారు. ఇక్కడ ఏటీ వందల మంది విద్యార్థులు, ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. అయతే మౌలిక సదుపాయాలు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో వారికి ఇబ్బందులు తప్పడంలేదన్నారు. వసతి, భోజన సదుపాయాలు ఒకేచోట జరగడానికి వీలుగా ఒక డార్మెటరీ భవనాన్ని నిర్మించాలన్నారు. ప్రవేశ మార్గానికి రహదారి సౌకర్యం, కాంపౌండ్ వాల్ నిర్మాణం చేపట్టాలని విన్నవించారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన ఎంపీ.. తాను స్వయంగా వచ్చి పరిశీలించి అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

గంజాయి నిందితుల ఆస్తుల జప్తు

● ఎస్పీ దామోదర్ రెడ్డి


గంజాయి, మద్యం కేసుల్లో పట్టుబడిన వాహనాలను పరిశీలిస్తున్న ఎస్పీ దామోదర్ రెడ్డి

మెంటాడ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): గంజాయి నిందితుల ఆస్తులను జప్తు చేస్తామని ఎస్పీ దామోదర్ రెడ్డి అన్నారు. సోమవారం ఆయన ఆంధ్ర పోలీసు స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్పీ విలేకరులతో మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా 17 మంది గంజాయి నిందితులు ఉన్నారన్నారు. ఇప్పటికే ఒకరి ఆస్తుల అటాచ్‌కు న్యాయస్థానం అనుమతి ఇచ్చిందన్నారు. గంజాయి రహిత జిల్లాగా తీర్చిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు. గంజాయి విషయంలో కఠినంగా వ్యవహరించేందుకు వెనుకాడబోమని స్పష్టం చేశారు. జిల్లాలో బెల్ట్ మద్యం షాపుల నిరోధానికి గట్టి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ సిబ్బంది, మహిళా పోలీసులతో మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బొబ్బిలి డీఎస్పీ భవ్యరెడ్డి, గజపతినగరం సీఐ రమణ, ఆంధ్ర ఎస్ఐ సీతారాం ఉన్నారు.

ఫిర్యాదుదారులతో ఫ్రెండ్లీగా మెలగాలి

●గజపతినగరం, నవంబరు10 (ఆంధ్రజ్యోతి): పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో పోలీసులు ఫ్రెండ్లీగా మెలిగి, వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎస్పీ దామోదర్ రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో ఆయన మాట్లాడుతూ పంచాయతీ ఎన్ని కలు సమీపిస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇప్పటికే సమస్యాత్మక గ్రామాలను గుర్తించామన్నారు. గంజాయిపై ఉక్కుపాదం మోపామని, పట్టుబడిన వారి ఆస్తులు జప్తు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో బొబ్బిలి డీఎస్పీ భవ్యరెడ్డి, సీఐ రమణ, ఎస్ఐ కిరణ్‌కుమార్ నాయుడు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ల పరిశీలన

●దత్తిరాజేరు, నవంబరు10 (ఆంధ్రజ్యోతి): బూర్జవలస, పెదమానాపురం పోలీస్ స్టేషన్లను సోమవారం ఎస్పీ దామోదర్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో బెల్టు షాపులను నివారించాలన్నారు. మాదకద్రవ్యాలు, గంజాయి వంటి వాటికి యువతను దూరంగా ఉంచాలన్నారు. వాటివల్ల కలిగే అనర్థాలపై గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. స్టేషన్‌కు వచ్చే వారితో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ఎక్కడికక్కడ స్పీడ్ బ్రేకర్లు, హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం రికార్డులను తనిఖీచేసి సంతృప్తి వ్యక్తం చే శారు. కార్యక్రమంలో బొబ్బిలి డీఎస్పీ భవ్యారెడ్డి, గజపతినగరం సీఐ వెంకట రమణ, స్టేషన్ బూర్జవలస ఎస్ఐ జి.రాజేశ్, పెదమానాపురం ఎస్ఐ ఆర్.జయంతి పాల్గొన్నారు.

సర్కిల్ కార్యాలయంలో తనిఖీ

●బొబ్బిలి, నవంబరు10 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి రూరల్ పోలీసు సర్కిల్ కార్యాలయాన్ని ఎస్పీ దామోదర్ రెడ్డి సోమవారం సందర్శించారు. ఆదివారం రాత్రి బొబ్బిలిలో ఎస్పీ బస చేసిన సంగతి తెలిసిందే. కార్యాలయం ఆవరణ, రికార్డులను ఆయన పరిశీలించారు. కార్యాలయ పరిసరాల పరిశుభ్రతపై ఎస్పీ సంతృప్తి వ్యక్తం చేశారు. రూరల్ సీఐ నారాయణరావును అభినందించారు. ఈ సందర్భంగా సర్కిల్ పరిధిలో క్రైమ్ రేటు, కేసుల పరిష్కార విధానం, ట్రాఫిక్ సమస్య, పెండింగ్ కేసుల పరిష్కారంపై సమీక్ష నిర్వహించారు. ఆయన వెంట బొబ్బిలి డీఎస్పీ భవ్యరెడ్డి ఉన్నారు.

ప్రజా ఫిర్యాదులపై దృష్టిపెట్టండి



ఫిర్యాదుదారుతో మాట్లాడుతున్న ఏఎస్పీ

విజయనగరం క్రైమ్, నవంబరు10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పోలీస్‌స్టేషన్ల పరిధిలో నమోదైన ప్రజా ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని జిల్లా అడిషనల్ ఎస్పీ సౌమ్యలత అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశమందిరంలో ప్రజా సమస్యలు పరిష్కార వేదికను ఆమె నిర్వహించారు. ఈ సందర్భంగా 42 ఫిర్యాదులను ఆమె స్వీకరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఫిర్యాదులను పరిశీలించి చట్ట పరిధిలో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్‌బీ సీఐ అంబేడ్కర్, డీసీఆర్‌బీ సీఐ కుమారస్వామి, ఎస్ఐ రాజేశ్ పాల్గొన్నారు.

లోకేశ్‌ను కలిసిన ఎమ్మెల్యే కళా


లోకేశ్‌తో ఎమ్మెల్యే కళా

చీపురుపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి లోకేశ్‌ను సోమవారం ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఉండవల్లిలోని మంత్రి నివాసంలో కలిసి.. నియోజకవర్గంలోని పలు అంశాలపై మాట్లాడారు. తోటపల్లి కాలువకు నిధుల మంజూరు, ఆర్‌ఈసీఎస్ పునరుద్ధరణ వంటి పెండింగ్ అంశాలపై కళా వెంకటరావు లోకేశ్‌కు వివరించారు. అనంతరం జిల్లాలోని రాజకీయ పరిస్థితులపై చర్చించారు.

సెంచూరియన్‌లో లక్ష దీపోత్సవం


దీపోత్సవంలో ప్రొఫెసర్ డి.ఎన్.రావు దంపతులు

నెల్లిమర్ల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం మూడో సోమవారాన్ని పురస్కరించుకుని సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో లక్ష దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సంస్థ ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ డి.ఎన్.రావు, పద్మ దంపతులు జ్యోతిప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభమైంది. కార్యక్రమంలో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ మహంతి, డీన్‌లు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాయితీలను సద్వినియోగం చేసుకోండి


దరఖాస్తులు స్వీకరిస్తున్న వైద్య బృందం

గజపతినగరం, నవంబరు10 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అవసరాల పిల్లలకు ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ డీఈవో మోహనరావు అన్నారు. సోమవారం స్థానిక భవిత కేంద్రం ఆవరణలో నియోజకవర్గం పరిధిలోని ప్రత్యేక అవసరాల పిల్లలకు ఉచిత సహాయ వైద్య నిర్ధరణ శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక అవసరాల పిల్లలకు శతశాతం రాయితీపై పరికాలను అందజేస్తామన్నారు. జీరో హాజరు శాతం ఉన్న పిల్లలకు తల్లి వందనం పథకం వర్తింపునకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. శిబిరానికి గజపతినగరం, దత్తిరాజేరు, గంట్యాడ, మెంటాడ మండలాల నుంచి 146 మంది హాజరుకాగా 105 మందిని పరికరాల కోసం గుర్తించారు. కార్యక్రమంలో అబ్జర్వర్ డాక్టర్ అమ్మినాయుడు, జిల్లా సహిత విద్య కో-ఆర్డినేటర్ ఎస్.సూర్యారావు, ఎంఈవోలు విమలమ్మ, చంద్రశేఖర్, ఐఆర్‌టీ శ్రీనివాసరావు

13న కొండపాలెంలో

●గరివిడి, నవంబరు10 (ఆంధ్రజ్యోతి): కొండపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలోని భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాల పిల్లలకు ఉచిత సహాయ ఉపకరణాలు అందించేందుకు ఈ నెల 13న వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు ఎంఈవోలు పి.రామారావు, అప్పన్నలు ఒక ప్రకటనలో తెలిపారు. సమగ్ర శిక్షా సహిత విద్య విభాగం ఆధ్వర్యంలో ఉచిత సహాయ ఉపకరణాల కోసం నిర్వహిస్తున్న శిబిరంలో చీపురుపల్లి నియోజకవర్గానికి చెందిన నాలుగు మండలాలు, చీపురుపల్లి, గరివిడి, మెరకముడిదాం, గుర్ల మండలాలకు చెందిన ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న 18 ఏళ్లలోపు ప్రత్యేక అవసరాలు గల పిల్లలు హాజరు కావచ్చన్నారు. వివరాలకు 9398043117 నెంబరును సంప్రదించాలని కోరారు.

12న రాజాంలో..

●రాజాం, నవంబరు10 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 12న ప్రత్యేక అవసరాల పిల్లలకు ఉచిత సహాయ ఉపకరణాలు అందించేందుకు వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు ఎంఈవోలు పి.ప్రవీణ్‌కుమార్, వై.దుర్గారావు ఓ ప్రకటనలో తెలిపారు. రాజాం, వంగర, రేగిడి, సంతకవిటి మండలాల్లోని జీరో నుంచి 18 ఏళ్ల లోపు దివ్యాంగులు శిబిరానికి హాజరుకావచ్చన్నారు. పూర్తి వివరాలకు, ఎస్ హరి బాబు 9440398300, వి.శ్రీనివాసరావు 8106160467 సంప్రదించాలన్నారు.

భూ కుంభం కోణంపై చర్యలు తీసుకోండి

శృంగవరపుకోట, నవంబరు10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జిందాల్‌కు అప్పగించిన భూముల కుంభకోణంపై చర్యలు తీసుకోవాలని స్థానికుడు డి.సూర్యారావు కోరారు. సోమవారం తహసీల్దార్ డి.శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించారు. 2015లో లోకాయుక్తా ఇచ్చిన తీర్పును అమలు చేయాలని కోరారు. నిర్వాసితులకు ఆర్‌ఆర్ ప్యాకేజీను అమలు చేయాలన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఎంఎస్‌ఎంఈ పార్కు నిర్మాణం చేపట్టాలన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

భోగాపురం, నవంబరు10 (ఆంధ్రజ్యోతి): డి ల్లీలో బాంబు దాడి జరగడంతో ముందస్తు చర్యల్లో భాగంగా సోమవారం రాత్రి సీఐ కె.దుర్గాప్రసాదరావు జాతీయ రహదారిపై వాహనాల తనిఖీ చేశారు. ఎన్‌హెచ్ 16 పరిధి పోలిపల్లి సమీపంలో వాహనాలను నిలుపుదల చేయించి క్షుణ్ణంగా పరిశీలించారు. అనుమానిత వ్యక్తుల సమాచారం అందించాలని సీఐ కోరారు.

సాలూరులో చోరీ

●రూ.37 వేల నగదు, 7 గ్రాముల బంగారం అపహరణ

సాలూరు, నవంబరు10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దండిగాం ప్రధాన రహదారిలో గల ఓ ఇంట్లో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. రూ. 37 వేల నగదు, 7 గ్రాముల బంగారం అపహరణకు గురైంది. ఇంటిలో ఎవరూ లేని విషయాన్ని గమనించిన దొంగలు ఇంట్లో చొరబడ్డారు. అనుకోకుండా చప్పుడు చేయడంతో పక్కింటి వాళ్లు గుర్తించి కేకలు వేయడంతో దొంగలు పరారయ్యారు. పట్టణ ఎస్ఐ అనిల్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలో 25వ వార్డు బంగారమ్మపేటలో నివాసం ఉంటున్న దేవుపల్లి వెంకటరావు, లక్ష్మి ఈ నెల 7న పెందుర్తి వెళ్లారు. ఆదివారం రాత్రి దొంగలు ఇంటిలో చొరబడి బీరువాను పగలగొట్టి డబ్బులు, విలువైన వస్తువులను తీసుకుని పరారయ్యేందుకు ప్రయత్నించారు. ఇంతలో ఇంట్లో పెద్ద చప్పుడు రావడంతో పక్కనే నివాసం ఉంటున్న బూరాడ ఆదినారాయణతో పాటు పలువురు కేకలు వేశారు. దాంతో దొంగలు పరారయ్యారు. బాధితుడు వెంకటరావు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ అప్పలనాయుడు, ఎస్ఐ అనిల్ కుమార్ సోమవారం ఉదయం ఘటనా స్థలిని పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు రూ.37 వేలు నగదు, 7 గ్రాముల బంగారం అపహరణకు గురైందన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

లక్కవరపుకోట (కొత్తవలస), నవంబరు10(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వ్యక్తి కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్టు కొత్తవలస సీఐ షన్ముఖరావు తెలిపారు. కొత్తవలస ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి 15 రోజుల కిందట దెబ్బలతో ఉన్నాడని గుర్తించి అతడిని విశాఖ కేజీహెచ్‌కి పోలీసులు తరలించారు. ఆ వ్యక్తి సోమవారం మృతి చెందాడని ఎస్ఐ తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

●ఓ పోలీస్ అధికారిపై ఆరోపణలు

వీరఘట్టం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కంబరవలస గ్రామానికి చెందిన కరక శ్రీధర్ సోమవారం మధ్యాహ్నం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అపస్మారక స్థితిని చేరుకున్న ఆయన్ని కుటుంబ సభ్యులు హుటాహుటిన వీరఘట్టం పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. మెరుగైన చికిత్స నిమిత్తం పాలకొండ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు వీరఘట్టం పోలీసులు ఆయన నుంచి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. కుటుంబ కలహాలలో భాగంగా శ్రీధర్‌పై భార్య గరుగుబిల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఓ పోలీస్ అధికారి కౌన్సిలింగ్ ఇచ్చిన సమయంలో ఇబ్బందులు పెట్టి మానసికంగా వేధింపులకు గురిచేసినట్లు శ్రీధర్ ఆరోపించారు. ఈ కారణంగానే ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు పోలీసులకు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

జామి, నవంబరు10 (ఆంధ్రజ్యోతి): పీతలపాలెం వద్ద రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం సోమవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో విజయనగరం నుంచి జామి వైపు వస్తున్న ద్విచక్ర వాహనం, ఎస్.కోట నుంచి విజయనగరం వెళ్తున్న ద్విచక్ర వాహనం ఎదురెదురుగా బలంగా ఢీకొన్నాయి. ప్రమాదంలో ఎస్.కోట మండలం కొట్టాం గ్రామానికి చెందిన వ్యక్తి, రేగిడి మండలం రౌతులపాలెం కు చెందిన వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. వారిలో కొట్టాం గ్రామానికి చెందిన వ్యక్తిను పోలీసులు 108 వాహనంలో విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రౌతులపాలెం వ్యక్తిను అతడి కుటుంబసభ్యులు వేరే వాహనంలో ఆసుపత్రికి తరలించారు.

ఇల్లు దగ్ధం

మెంటాడ, నవంబరు10 (ఆంధ్రజ్యోతి): జగన్నాథపురంలో సోమవారం మధ్యాహ్నం జరిగిన అగ్ని ప్రమాదంలో తీగల నరసింహులుకు చెందిన ఇల్లు దగ్ధమైంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదం సంభవించినట్లు తెలిసింది. ప్రమాద సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో కట్టుబట్టలతో బాధితులు మిగిలారు. నగదు, బంగారం, సర్టిఫికెట్లు కాలిపోయినట్టు బాధితులు తెలిపారు.

రెండో ఏఎన్‌ఎంల నిరసన

విజయనగరం కలెక్టరేట్, నవంబరు10 (ఆంధ్రజ్యోతి): వైద్య, ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ రెండో ఏఎన్ఎంలు సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పని సర్దుబాటు పేరుతో అతి తక్కువ వేతనాలతో పనిచేస్తున్న రెండో ఏఎన్ఎంలను సదూర ప్రాంతాలకు బదిలీలు చేయడం తగదన్నారు. గత మాదిరిగా యూనిఫామ్ అలెవెన్స్‌లు చెల్లించాలన్నారు. ఎంటీఎస్ అమలు చేయాలని కోరారు. ఉద్యోగ విరమణ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలని వారు డిమాండ్ చేశారు.

గాయపడిన వ్యక్తికి బ్రెయిన్‌డెడ్

దత్తిరాజేరు, నవంబరు10 (ఆంధ్రజ్యోతి): మరడాం సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి బ్రెయిన్‌డెడ్ అయినట్టు బూర్జవలస ఎస్ఐ జి.రాజేశ్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు మరడాం సమీపంలో ఆగి ఉన్న లారీని స్కూటీతో ఢీకొన్న ప్రమాదంలో గొటివాడ అభిషేక్(20), కడియాల సుశాంత్ గాయాలపాలయ్యారు. ఈ ప్రమాదంలో తలకు బలమైన గాయాలు కావడంతో విజయనగరం మహరాజా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు సోమవారం అభిషేక్‌ను వైద్యం అందించగా బ్రెయిన్‌డెడ్‌గా ధ్రువీకరించారని ఎస్ఐ తెలిపారు. అవయవదానం చేయనున్నట్టు కుటుంబ సభ్యుల నుంచి సమాచారం అందిందన్నారు. వైద్యులు ఇచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేస్తామని ఎస్ఐ తెలిపారు.

బాలిక ఆచూకీ కోసం ఐదు బృందాలు


విచారణ చేస్తున్న ఏఎస్పీ మనీషా

బొబ్బిలి, నవంబరు10 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలిలో నివాసం ఉంటున్న పార్వతీపురం మన్యం జిల్లా బలిజిపేట మండలం అరసాడకు చెందిన ఉపాధ్యాయుడు వంగపండు వెంకటనాయుడు కుమార్తె హారిక అలియాస్ స్నేహ ఆచూకీ కోసం ఐదు బృందాలతో దర్యాప్తు కొనసాగిస్తున్నట్టు పార్వతీపురం ఏఎస్పీ వంగలరెడ్డి మనీషా తెలిపారు. సోమవారం ఆమె బొబ్బిలి టీచర్స్ కాలనీకి వచ్చి స్నేహ కుటుంబ సభ్యులతో ఆమె మాట్లాడారు. బొబ్బిలి మండలం కోమటిపల్లి వివేకానంద కళాశాలలో డిప్లొమా చదువుతున్న స్నేహ ఈ నెల 5 న అదృశ్యం అయిన నేపథ్యంలో ఈ కేసును స్థానిక పోలీసుస్టేషన్‌లో జీరో ఎఫ్ఐఆర్ కింద నమోదు చేసి బలిజిపేట పోలీసులకు అప్పగించారు. దీనితో ఏఎస్పీ మనీషా దర్యాప్తు నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే బేబీనాయన ద్వారా సమాచారం తెలుసుకున్న హోమ్‌మంత్రి వంగలపూడి అనిత ఈ కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు బాలిక ఆచూకీని కనుగొని తల్లిదండ్రులకు అప్పగించాలని ఆదేశించినట్టు తెలిసింది.

కళ్లకు గంతలతో నిర్వాసితుల ఆందోళన

ఎస్.కోట రూరల్, నవంబరు10 (ఆంధ్రజ్యోతి):జిందాల్ యాజమాన్యం న్యాయం చేయాలని కోరుతూ బొడ్డవరకు చెందిన నిర్వాసితులు సోమవారం కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. న్యాయం చేయాలని కోరుతూ నిర్వాసితులు 145 రోజులుగా ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే. నిర్వాసితుల నిరసన దీక్షలకు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్వాసితులకు బాసటగా నిలవాల్సిన ప్రభుత్వం... జిందాల్ కంపెనీకి మద్దతుగా నిలవడం బాధాకరమన్నారు. నిర్వాసితులకు న్యాయం చేయాలని కోరారు.

జాతీయ స్థాయి పోటీలకు పలువురు విద్యార్థులు


క్రీడాకారులకు జ్ఞాపికలను అందజేస్తున్న ఎమ్మెల్సీ శ్రీనివాసులు నాయుడు


చంద్రకళ


జాహ్నవి


రజినీని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మెంటాడ, నవంబరు10 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి లాంగ్ జంప్ పోటీల్లో పోరాం ఉన్నత పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థిని కాదూరు చంద్రకళ ద్వితీయ స్థానం సాధించి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించింది. డిసెంబరు 1 నుంచి నాలుగు రోజుల పాటు మధ్యప్రదేశ్ ఇండోర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో చంద్రకళ పాల్గొననుంది. ఈ సందర్భంగా విద్యార్థినిని హెచ్‌ఎం ఎస్.నీలాద్రినాథ్, పీడీ తవిటినాయుడు, సిబ్బంది అభినందించారు.

ఖోఖో పోటీలకు గర్భాం విద్యార్థిని

జిమెరకముడిదాం, నవంబరు10 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్‌లో ఇటీవల రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో మండలంలోని గర్భాం మోడల్ స్కూల్‌లో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న రౌతు జాహ్నవి సత్తా చాటింది. రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి అండర్-19 ఖోఖో పోటీలకు రాష్ట్ర జట్టు తరఫున ఎంపికైందని ప్రిన్సిపాల్ డీవీఎస్ అరుణ తెలిపారు. ఈ సందర్భంగా జాహ్నవిని ఆమె అభినందించారు. జాతీయ స్థాయిలోనూ రాణించాలని ఆకాంక్షించారు. విద్యార్థినికి శిక్షణ ఇచ్చిన పీడీ రాంబాబు, జిల్లా కోచ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. మోడల్ స్కూల్‌లో విద్యార్థిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడంపై ప్రిన్సిపాల్, సిబ్బంది, ఎస్ఎంసీ కమిటీ, తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.

స్విమ్మింగ్‌లో సత్తా చాటిన రజినీ

రేగిడి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): లింగాలవలస ఉన్నత పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థిని ఎల్.రజినీ అండర్-19 విభాగం రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచింది. బ్యాక్ స్ట్రోక్ విభాగంలో ఏకంగా బ్రాంజ్ మెడల్ సాధించిందని హెచ్‌ఎం డి.కృష్ణారావు తెలిపారు. ఈనెల 8, 9 తేదిల్లో విశాఖలో రాష్ట్రస్థాయి ఆక్వా స్విమ్మింగ్ పోటీలకు లింగాలవలస స్కూల్ నుంచి ఐదుగురు విద్యార్థులు హాజరు కాగా, వీరిలో రజినీ పతకాన్ని కైవసం చేసుకుంది.

రాష్ట్రస్థాయి ఖోఖో విజేత ప్రకాశం

విజయనగరం టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నగరంలోని విజ్జీ క్రీడా మైదానంలో ఈ నెల 8 నుంచి 10 వరకూ నిర్వహించిన అండర్-10 బాలబాలికల రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో ప్రకాశం జిల్లా జట్టు విజేతగా నిలిచింది. ద్వితీయ స్థానంలో విజయనగరం, తృతీయ స్థానంలో విశాఖపట్నం, చిత్తూరు జట్లు నిలిచాయి. విజేతలకు ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు షీల్డ్‌లు ప్రదానం చేశారు. అందించారు. కార్యక్రమంలో పోటీల నిర్వాహకుడు గోపాల్, పలువురు అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

బల్క్‌మిల్క్ కూలింగ్ సెంటర్ ఏర్పాటు చేయండి

పార్వతీపురం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురంలో బల్క్‌మిల్క్ కూలింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర ఏపీ డెయిరీ డెవలప్‌మెంట్ కో-ఆపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్ ఉన్నతాధికారి మురళీధర్‌ను కోరారు. సోమవారం అమరావతిలో ఆయన్ని కలిసి వినతిపత్రం అందించారు. పాడి రైతులు సరఫరా చేసే పాలకు అధిక ధర వచ్చే విధంగా చూడాలని కోరారు. వారికి మేలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. దీనిపై మురళీధర్ సానుకూలంగా స్పందించినట్టు ఎమ్మెల్యే సోమవారం విలేకరులకు తెలిపారు.

ఇళ్ల మంజూరుకు ఆవాస్ ప్లస్‌లో దరఖాస్తు

జియ్యమ్మవలస, నవంబరు10(ఆంధ్రజ్యోతి): ఇళ్ల మంజూరు కోసం ఆవాస్ ప్లస్‌లో దరఖాస్తు చేసుకోవాలని గృహ నిర్మాణశాఖ ఏఈ ఎల్.ఉమామహేశ్వరరావు కోరారు. సోమవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ.. గతంలో పీఎంఏవై గ్రామీణ్‌లో ఇళ్లు మంజూరైన వారు కూడా ఈ ఆవాస్ ప్లస్‌లో దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. లేకపోతే ఇళ్లు మంజూరు కాదని తేల్చి చెప్పారు. ఈ నెలాఖరులోగా రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, బ్యాంకు అకౌంట్, కుల, ఆదాయ ధ్రువపత్రాలు, పొజిషన్ సర్టిఫికేట్, ఇంటి స్థలం పట్టా ధ్రువపత్రాలు సంబంధిత సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ వద్దకు తీసుకెళ్లి ఆన్‌లైన్ చేయించుకోవాలని కోరారు.

న్యాయ సేవలపై అవగాహన

కురుపాం,నవంబరు10(ఆంధ్రజ్యోతి): జాతీయ న్యాయసేవల దినోత్సవం పురస్కరించుకుని కురుపాం కోర్టులో సోమవారం న్యాయ అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా న్యాయాధికారి సౌమ్యా జోస్పిన్ మాట్లాడుతూ.. న్యాయ సేవలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లు గ్రామాల్లో పర్యటించి ప్రజలను చైతన్యపర్చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

సీపీ బ్రౌన్‌కు నివాళి

బెలగాం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి) : తెలుగు భాషా పరిశోధన, గ్రంథ పరిష్కరణకు సుస్థిరమైన మార్గం చూపిన మహనీయుడు సీపీ బ్రౌన్ అని కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. బ్రౌన్ జయంతి సందర్భంగా సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆయనను ఆదర్శంగా తీసుకుని తెలుగులో సంతకం పెట్టి భాషా ఔన్నిత్యాన్ని చాటిచెబుదామని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జేసీ యశ్వంత్‌కుమార్ రెడ్డి, డీఆర్వో హేమలత తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం విక్రయాలకు సిద్ధం



గరుగుబిల్లిలో ధాన్యం నిల్వలు ఆరబెట్టిన దృశ్యం

గరుగుబిల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల రైతులు ధాన్యం విక్రయాలకు సన్నద్ధమవుతున్నారు. దీనిలో భాగంగా సోమవారం యంత్రాలతో నూర్పులు చేసి ట్రాక్టర్ల సహాయంతో ఖాళీ ఉన్న ప్రాంతాల్లో ధాన్యాన్ని ఆరబోశారు. తుఫాన్ కారణంగా పలు గ్రామాల్లో వరి నేలకొరగడంతో పాటు ధాన్యం తడిసిపోయింది. దీంతో రైతులు యంత్రాల సహాయంతో నూర్పులు చేపట్టి తేమ శాతాన్ని తగ్గించేలా ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. కాగా తుఫాన్ కారణంగా తడిసి, రంగు మారిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రమంలో రైతులు కొనుగోలు కేంద్రాలకు పూర్తిస్థాయిలో ధాన్యం చేరవేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

బొబ్బిలి కోటలో పడిపూజ



భక్తి పాటలకు లయబద్ధంగా అడుగులు వేస్తున్న బేబీనాయన

బొబ్బిలి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): బొబ్బిలి కోటలో వేలాది మంది అయ్యప్పస్వాములతో ఎమ్మెల్యే బేబీనాయన సోమవారం పడిపూజను ఘనంగా నిర్వహించారు. గురుస్వాములు మరడాన రవి, నిష్టల ధర్మారావు తదితరుల ఆధ్వర్యంలో అత్యంత వైభవోపేతంగా పూజా కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. గురుస్వామి రవి ఆధ్యాత్మికతత్వాన్ని, అయ్యప్పస్వామి మహత్యాన్ని పూజలతో, పాటలతో, వర్ణనలతో విశేషంగా తెలియజేశారు. కొన్ని భక్తి పాటలకు లయబద్ధంగా ఆయన అడుగులు వేయడంతో ఎమ్మెల్యే బేబీనాయన సైతం జతకలిపారు. అయ్యప్ప స్వాములు నాట్యం చేసి అయ్యప్ప నామస్మరణలతో హోరెత్తించారు. బొబ్బిలి అసెంబ్లీ నియోజకవర్గంలోని నాలుగు మండలాలనుంచే కాకుండా పొరుగున ఉన్న పార్వతీపురం మన్యం జిల్లా సీతానగరం, బలిజిపేట మండలాలకు చెందిన అనేక మంది భక్తులు విచ్చేసారు. వేలాది మంది అయ్యప్పస్వాములకు ఎమ్మెల్యే బేబీనాయన భిక్ష (అన్న ప్రసాద వితరణ) పెట్టారు.

కొత్త ఇళ్ల నిర్మాణాల కోసం జియో ట్యాగింగ్

రామభద్రపురం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): పక్కా ఇళ్ల కోసం గ్రామ పంచాయతీల్లో జియో ట్యాగింగ్ చేపడుతున్నామని మండల హౌసింగ్ అధికారి మత్స వెంకటేష్ తెలిపారు. సోమవారం బూసాయవలస గ్రామంలో ఇళ్ల నిర్మాణాలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 22 గ్రామ పంచాయతీల్లో ఇప్పటివరకు 1370 ఇళ్లు మంజూరయ్యాయని తెలిపారు.

అర్జీలను సకాలంలో పరిష్కరించాలి

● పీజీఆర్ఎస్‌లో అధికారులకు కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి ఆదేశం



అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి

బెలగాం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు వచ్చిన అర్జీలను సకాలంలో పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. రెవెన్యూ సమస్యలకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని , అర్జీలు పునరావృతం కాకుండదని సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్ నిర్వహించారు. మొత్తంగా 99 వినతులను అధికారులను స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారులతో కలెక్టర్ మాట్లాడి.. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించి తన భూమిని ప్రభుత్వ రికార్డుల నుంచి తొలగించాలని కురుపాం మండలం గోళ్ల గ్రామానికి చెందిన శెట్టి శ్రీనివాసరావు కోరారు. దండుసూర గ్రామంలో ఇందిరా కాలనీ నుంచి పెల్లి మెట్టు వరకు బీటీ రోడ్డు వేయాలని ఆ ప్రాంతవాసులు అర్జీ అందించారు. తన తండ్రి అకాల మరణం చెందారని, జీరో ఎక్స్‌టెంట్ నుంచి తమ భూములను తొల గించాలని వీరఘట్టం మండలం సంత నర్సింగపురానికి చెందిన సాధువాసు నాయుడు వినతిపత్రం ఇచ్చారు. కబ్జాదారుల నుంచి అంగన్‌వాడీ కేంద్రాన్ని రక్షించాలని కొమరాడ మండలం విక్రపురం వాసులుకోరారు. నవంబరు నెల పింఛన్ ఇప్పించాలని మక్కువ మండలం శంబర గ్రామానికి చెందిన చిప్పాడ నారాయణమ్మ కోరింది.

బస్సు సౌకర్యం కల్పించండి

జియ్యమ్మవలస: తమ గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలంటూ పెదబుడ్డిడి గ్రామ పెద్దలు వినతిపత్రం అందజేశారు. గతంలో నాగూరు, తురకనాయుడువలస, లఖనాపురం, రావివలస మీదుగా తమ గ్రామానికి బస్సు సౌకర్యం ఉండేదని, నైట్ హాల్ట్ కూడా తమ గ్రామంలోనే ఉండేదని తెలిపారు. రోడ్లు బాగోలేవని బస్సు ఆపేశారన్నారు. ఇప్పుడు రోడ్డు బాగానే ఉందని, బస్సు సౌకర్యం కల్పించాలని వేడుకున్నారు.

గర్భిణుల ఆరోగ్యంపై నిరంతర పర్యవేక్షణ

గరుగుబిల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): గర్భిణుల ఆరోగ్యంపై ఆశా వర్కర్లకు నిరంతర పర్యవేక్షణ ఉండాలని గరుగుబిల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి ఎన్ఎంకే తిరుమలప్రసాద్ వెల్లడించారు. పీఎం మాతృత్వ వందన యోజన కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణుల ఆరోగ్య శ్రేయస్సుకు వైద్య సిబ్బంది అంకితభావంతో వైద్య సేవలు అందించాలని తెలిపారు. గర్భిణుల్లో రక్తహీనత, హైరిస్క్ సమస్యలు తలెత్తకుండా ఉండేలా కృషి చేయాలన్నారు. మాతా శిశు సంరక్షణ కార్డులో ఆరోగ్య తనిఖీలు, వైద్య పరీక్షల వివరాలు పరిశీలించి నివేదికలు హెచ్చు తగ్గులు గుర్తించి గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. గర్భిణుల్లో జ్వర లక్షణలు గుర్తిస్తే హైరిస్క్‌గా పరిగణించి సత్వరమే సమాచారం ఇవ్వాలన్నారు. డీహైడ్రేషన్‌కు గురికాకుండా ఎక్కువగా నీరు, ద్రవ రూప ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. పీహెచ్‌సీలో సాధారణ ప్రసవాలు జరిగేలా వైద్య సిబ్బంది చర్యలు చేపట్టాలని సూచించారు.

●ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే గర్భిణులకు బురదవెంకటాపురం గ్రామానికి చెందిన బొత్స శ్రీహరిరావు, ఇంద్రాణి దంపతులు సహకారంతో సోమవారం అన్న ప్రసాదాన్ని ఏర్పాటు చేశారు. మండల కేంద్రంలోని శ్రీషిర్డీ సాయి దేవ సంస్థానం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

గర్భిణులు ఆసుపత్రిలో చేరాలి

సీతానగరం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని గర్భిణులు ప్రసవ సమయంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో చేరాలని పీహెచ్‌సీ డాక్టర్ పి.ఉషారాణి అన్నారు. పీఎంఎస్ఎంఏ పథకం అమలులో సోమవారం పీహెచ్‌సీలో 50 మంది గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు గిరిజన విద్యార్థిని ఎంపిక

● అభినందించిన పాఠశాల సిబ్బంది



విద్యార్థినిని అభినందిస్తున్న పాఠశాల సిబ్బంది

సీతంపేట రూరల్, నవంబరు10 (ఆంధ్రజ్యోతి): స్థానిక గిరిజనసంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న సవర కావ్య డిస్కస్ త్రో పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. రెండు రోజుల కిందట శ్రీకాకుళం జిల్లాలోని గోవిందపురం గ్రామంలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్(స్కూల్ గేమ్స్ ఫెడరేషన్)క్రీడాపోటీల్లో సవర కావ్య సత్తాచాటి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం వసంతలక్ష్మి సోమవారం తెలిపారు. జాతీయ స్థాయిలో కూడ రాణించి ఐటీడీఏ, పాఠశాలకు పేరు తీసుకురావాలని హెచ్ఎం,హెచ్‌డబ్ల్యూవో పి. అమల, పీడీ బి శైలజ కోరుతూ.. విద్యార్థి కావ్యను అభినందించారు.

అంతర జిల్లాల చాంపియన్ రన్నర్‌గా బొడ్డవలస విద్యార్థి

సాలూరు రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సాఫ్ట్‌బాల్ అంతర జిల్లాల చాంపియన్ షిప్-2025 రన్నర్‌గా బొడ్డవలస బీఆర్ అంబేడ్కర్ గురుకులం విద్యార్థి పి.జనార్దనసాయి నిలిచినట్టు ప్రిన్సిపాల్ మూర్తి చెప్పారు. ఆయన సోమవారం విలేఖర్లతో మాట్లాడారు. గుంటూరు జిల్లా పిడుగురాళ్లలో జరిగిన 12వ సాఫ్ట్‌బాల్ చాంపియన్ షిప్ పోటీల్లో జనార్దన్‌సాయి ప్రతిభ చూపి రన్నర్‌గా నిలిచాడన్నారు. విజయనగరం జిల్లా పారాదిలో జరిగిన రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ ఎంపికల్లో నలుగురు విద్యార్థులు ఎంపికైనట్టు చెప్పారు. సాఫ్ట్‌బాల్‌కు పి.జే.సాయి, కే సంతోష్, ఎ.రిషిలు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. బేస్‌బాల్‌కు బి.నితిన్‌సాయి ఎంపికైనట్టు చెప్పారు. ప్రతిభ చూపిన విద్యార్థులను పీఈటీ ఎస్.అప్పలనాయుడు తదితరులు అభినందించారు.



విజేతను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండండి

విజయనగరం క్రైమ్, నవంబరు10 (ఆంధ్రజ్యోతి) సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ ఆర్.గోవిందరావు అన్నారు. సోమవారం నగరంలోని చైతన్య డిగ్రీకళాశాలలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సు లో ఆయన మాట్లాడారు. శక్తి యాప్ మహిళలకు రక్షణ కలిగిస్తుందని, ప్రతీ విద్యార్థిని శక్తి యాప్‌ను మొబైల్లో డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. .సోషల్‌మీడియాకు దూరంగా ఉండాలని, అసభ్యకరమైన మెసేజ్‌లు, ఫొటోల ఇతరులకు పంపి నట్టయితే కేసులు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ సూర్యనారాయణ ఉన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో రూ.10వేలు జరిమానా

రామభద్రపురం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం లో ఇటీవల జరిపిన వాహన తనిఖీల్లో మద్యం సేవించి వాహ నం నడుపుతున్న సాలూరు వడ్డి వీధికి చెందిన మొయిద పవన్ కుమార్‌కు రూ.10వేల జరిమానా విధిస్తూ సోమవారం సాలూరు జేఎఫ్‌సీఎం మేజిస్ట్రేట్ జి.హర్ష వర్ధన్ తీర్పు ఇచ్చారని ఎస్ఐ ప్రసాద్ తెలిపారు. మద్యం తాగి ఏ ఒక్కరూ వాహనాలు నడపరా దని ఆయన హెచ్చరించారు.

19న మహిళా డే

బొబ్బిలి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సత్యసాయి శతవర్ష జన్మదిన వేడుకలలో భాగంగా బొబ్బిలి సత్యసాయి సమితి ఆధ్వర్యంలో అనేక సేవా, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సమితి కన్వీనరు బి.లక్ష్మణరావు, జిల్లా వేదం కన్వీనర్ తమ్మిరెడ్డి వేణుగోపాలనాయుడు, మహిళా సమన్వయకర్త ఎం.చిన్నమ్మ వెల్లడించారు. స్థానిక ఫూల్‌బాగ్ సత్యసాయి మందిరంలో సోమవారం వారు వేడుకల షెడ్యూల్‌ను వివరించారు. ఈ నెల 19న మహిళా డే నిర్వహించి బాబా పల్లకీసేవ నిర్వహిస్తా మన్నారు. 20న సాయివ్రతాలు, 22న ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, పాలు పంపిణీ, 23న సాయిమందిరంలో ఆరువేల మందికి అన్నదానం, వెయ్యి మందికి దుస్తులు పంపిణీ చేపడతామన్నారు. బాబా జన్మదిన వేడుకలను రాష్ట్ర పండుగగా ప్రభుత్వం ప్రకటిస్తూ రూ. 10 కోట్లు నిధులను విడుదల చేయడం హర్షనీయమన్నారు.

విద్యార్థులకు చదరంగం పోటీలు

చీపురుపల్లి, నవంబరు10(ఆంధ్రజ్యోతి): బాలల దినోత్సవాన్ని పురస్క రించుకుని విద్యార్థులకు చదరంగం పోటీలు నిర్వహించనున్నామని సీనియర్ నేషనల్ ఆర్బిటర్ ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-8, 12, 16 కేటగిరీల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గలవారు ఈ నెల 13లోగా తమ వివరాలను 9642546955కు ఫోన్ చేసి నమోదు చేసుకోవాలన్నారు. పట్టణంలోని శ్రీనివాస జూనియర్ కళాశాలలో ఈ పోటీలు జరుగుతాయన్నారు.

డోకులగూడ రహదారి నిర్మించరూ!



అధ్వానంగా మారిన రహదారి

భామిని, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇసుకగూడ నుంచి డోకులగూడ వరకూ రహదారి నిర్మించాలని గిరిజనులు కోరుతున్నారు. ప్రస్తుతం రోడ్డు అధ్వానంగా మారడంతో రాకపోకలు సాగించలేకపో తున్నామని వారు వాపోతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు రహదారి పూర్తిగా కొట్టుకుపోయిందన్నారు. ద్విచక్ర వాహనంపైనే కాదు.. కాలినడకన కూడా ప్రయాణించలేని పరిస్థితి ఏర్పడిందని గిరిజన సంఘం నాయకులు కె.భాస్కరరావు, ప్రసాద్, రమేష్, పి.ఐబో, గగన్న తెలిపారు. ఇప్పటికైనా ఐటీడీఏ అధికారులు పరిశీలించి రహదారిని బాగు చేయాలని వారు డిమాండ్ చేశారు.

ఐటీడీఏ పీజీఆర్ఎస్‌కు 54 వినతులు



వినతులు స్వీకరిస్తున్న అధికారులు

సీతంపేట రూరల్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): సీతంపేట ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు గిరిజనుల నుంచి 54వినతులు వచ్చాయి. అన్నదాత సుఖీభవ పథకం నగదు ఇప్పించాలని చిన్నరావు గ్రామానికి చెందిన బి.శ్రీరాములు కోరారు. ఇంటి నిర్మాణం కొరకు పొజీషన్ సర్టిఫికెట్ మంజూరు చేయాలని సరస్వతి, మేకల రుణం కోసం జయలక్ష్మి, సీసీ రహదారికి ఇరువైపుల రక్షణ గోడ నిర్మించాలని సవర సురేష్, కుట్టుమిషన్ ఇప్పించాలని సవర సరస్వతి అర్జీలు ఇచ్చారు. నాటుకోళ్ల షెడ్డు మంజూరు చేయాలని సవర కూర్మారావు, ఆర్థిక సహాయం చేయాలని మందస మండల పద్మాపురంకాలనీకి చెందిన సవర జ్యోతి, పవర్‌వీడర్ ఇప్పించాలని నరసయ్య వినతులు ఇచ్చారు. డిప్యూటీ ఈవో జిరామ్మోహనరావు, టీడబ్ల్యూ ఈఈ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి

పాలకొండ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా జనసేన పార్టీ ఉపాధ్యక్షుడు గర్భాన సత్తిబాబు కోరారు. సోమవారం లుంబూరు గ్రామంలో పర్యటించారు. గ్రామ జనసేన కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలన్నారు. అంతకముందు ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్య పరిష్కరించాలని ఆ ప్రాంతవాసులు కోరారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ దృష్టికి తీసుకెళ్తానని ఆయన వెల్లడించారు. ఈ పర్యటనలో స్థానిక కూటమి నాయకులు పాల్గొన్నారు.

దుగ్గేరులో 'అమృతభూమి' రిసోర్స్ సెంటర్

మక్కువ రూరల్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంలో భాగంగా దుగ్గేరు గ్రామంలో సోమవారం అమృతభూమి ఆర్గానిక్ బయో ఇన్పుట్ రిసోర్సు సెంటర్‌ను ఏవో చింతల భారతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయం వల్ల ఒక్కరికీ ఎంతో ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. దుగ్గేరులో ప్రారంభించిన రిసోర్స్ సెంటర్‌లో అన్నిరకాల కషాయాలు, ద్రావణాలు, పసుపు, నీలం పల్లాలు, జీవామృతం కవర్లు ఉంటాయన్నారు. ఘనద్రవం, జీవామృతం , నవధాన్యాలు, ఆర్డీఎస్ విత్తనాలు, కూరగాయలతోపాటు అన్నిరకాల దేశీవిత్తనాలు అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. ఈకార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం మండల ఇన్‌చార్జి నాగార్జున , పనసభద్ర సర్పంచ్ సీదరపు నాగేశ్వరావు, గ్రామపెద్దలు, రైతులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

వీరఘట్టం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో రోడ్ల విస్తరణలో భాగంగా తొలగించిన అంబేడ్కర్ విగ్రహాన్ని అదే జంక్షన్‌లో ఏర్పాటు చేయాలని కేవీపీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు.అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి సిబ్బందికి వినతిపత్రం అందించారు. ఎన్నిసార్లు సంబంధిత కాంట్రాక్టర్‌కు తెలియజేసినా పట్టించుకోవడం లేదన్నారు. కేవీపీఎస్ నాయకులు సింహాచలం, వి.ఇందిర, ఎన్.రాజబాబు, శివ, ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

డీసీఎంఎస్ స్థలం పరిశీలన

పాలకొండ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నాగవంశపువీధిలో ఉన్న డీసీఎంఎస్ స్థలాన్ని ఆశాఖ ఛైర్మన్ చౌదరి అవినాష్ సోమవారం పరిశీలించారు. దాదాపు ఎకరా 10 సెంట్లు ఉన్న ఈ స్థలంలో ఆక్రమణకు గురికాకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఇప్పటికే ప్రహరీ నిర్మాణానికి రంగం సిద్ధం చేశామని తెలిపారు. ఈ క్రమంలోనే షాపులను నిర్మించేందుకు అంచనాలు వేస్తున్నామన్నారు. ఆయన వెంట మేనేజర్ జగ్గునాయుడు ఉన్నారు.

రైతులను ఆదుకోండి

కొమరాడ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధాన్యం కొనుగోలు కేం ద్రాలు ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి కొల్లి సాంబమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల పరిధిలో 11 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు ప్రకటించినా ఇప్పటి వరకూ ప్రారంభించకపోవడం దారుణమన్నారు.

విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ

బెలగాం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తన కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ కార్యక్రమంలో భాగంగా సోమవారం పార్వతీపురంలోని జడ్పీ పాఠశాల విద్యార్థినులకు 20 సైకిళ్లు పంపిణీ చేసింది. ఎస్‌బీఐ బొబ్బిలి రీజనల్ మేనేజర్ బి.బి.సాహు సహకారంతో వాటిని అందించినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆన్‌లైన్ మోసం, సైబర్ సెక్యూరిటీపై అవగాహన కల్పించారు. బొబ్బిలి రీజినల్ ఆఫీస్ ఛీఫ్ మేనేజర్ సువేందు శేఖర్ జెనా, మేనేజర్ ప్రవీణ్ కుమార్, పార్వతీపురం బ్రాంచ్ చీఫ్ మేనేజర్ మాధవ్ రంజన్ దత్త పాల్గొన్నారు.

అప్రెంటీస్‌కు 48 మంది ఎంపిక

సాలూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఐటీఐలో జరిగిన అప్రెంటీస్ మేళాలో 48 మంది ఎంపికైనట్టు ఐటీఐ ప్రిన్సిపాల్ శ్రీనివాసాచార్యులు తెలిపారు. బుధవారం ఈ మేళాకు 64 మంది హాజరు కాగా విశాఖ యోకోమోటైర్స్ కంపెనీకి 18 మంది, పాటిల్‌రైల్ ఇన్‌ఫ్రాస్టక్చర్‌కు 12 మంది, కొవ్వూరు ప్లాంట్‌కు 8మంది, విశాఖ కార్బన్‌కు 10 మంది ఎంపికైనట్టు వెల్లడిచారు. కంపెనీల హెచ్‌ఆర్‌లు, అప్రంటీస్ అడ్వైజర్ పాల్గొన్నారు.